ఈనాడు
అన్నమయ్య
బుధవారం అక్టోబరు 16, 2024



పీలేరు సమీప అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

అదో ఏనుగుల గుంపు... తలకోన అటవీ ప్రాంతం నుంచి అప్పుడప్పుడు జిల్లా సరిహద్దులోని గ్రామాల్లోకి చొరపడుతుంటుంది... వాటి కంట పడ్డారో అంతే సంగతులు. గ్రామంలోకి వస్తే విధ్వంసం, పంట పొలాలపై పడితే సర్వ నాశనం, మనుషులు ఎదురు పడితే మరణశాసనం. అంత ప్రమాదం లేదులే అనుకున్న ప్రతిసారీ తమ ఉనికిని చాటుకుంటూ గజగజ వణిస్తున్నాయి. మంగళవారం మరో రైతు భయం'కరి' ధాటికి మృత్యువాత పడ్డారు. ఈ గుంపు నుంచి రక్షణ కల్పించాలని సరిహద్దు గ్రామాల వారు కోరుతున్నారు.

భయంకరి



\- న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ, కలికిరి గ్రామీణ

పీలేరు మండలంలో ఏనుగుల గుంపు సంచారం సంచలనం రేకెత్తించింది. సుమారు 15 వరకు ఏనుగులు సోమవారం రాత్రి పీలేరు మండలంలోకి ప్రవేశించాయి. వారం రోజులుగా చిత్తూరు జిల్లా పులిచెర్ల మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఈ ఏనుగులు సంచారం ఉంది. ఈ మండలానికి పక్కనే పీలేరు మండలం ఉండడంతో ఆ గుంపు ఇక్కడికి ప్రవేశించింది. పీలేరు మండల పరిధిలో ఏనుగుల సంచారం ఇదే మొదటిసారి. ఇవి ఒకసారి ప్రవేశించాయంటే ఆ ప్రాంతంలో ఉండే పంట పొలాలపై పడి విధ్వంసం సృష్టిస్తాయి. కనపడిన మనుషులను తొక్కి చంపేస్తాయి.

గతంలో జరిగిన ఉదంతాలివి...

- కలికిరి-వాల్మీకిపురం మండలాల సరిహద్దులోని గుట్టపాళెం, మేకలవారిపల్లె అటవీ ప్రాంతంలోకి ఫిబ్రవరిలో రెండు ఏనుగులు దారి తప్పి వచ్చాయి. అటవీ శివారు ప్రాంతంలోని అరటి, వరి, టమాట పొలాలను తొక్కి నష్టపరిచాయి. చిత్తూరు జిల్లా సోమల, చౌడేపల్లె అటవీ ప్రాంత సరిహద్దుల నుండి దారి తప్పిన ఏనుగులు ఇక్కడికి రావడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురయ్యారు. పొలాల వద్ద ఏనుగుల సంచారాన్ని చూసిన పలువురు రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేయడంతో వారు అప్రమత్తమయ్యారు.
- ఏడాది కిందట దారి తప్పిన ఒంటరి ఏనుగు కలికిరి-వాల్మీకిపురం మండలాల సరిహద్దులోని అరటి తోటపై పడి విధ్వంసం సృష్టించి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగించింది.
- అయిదేళ్ల క్రితం పలమనేరు మొగిలి అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఓ ఒంటరి ఏనుగు రామసముద్రం సమీపంలో కొండపై చిక్కుకుపోవడంతో శిక్షణ పొందిన మరో రెండు ఏనుగుల సాయంతో దానిని కొండ దించారు. అయితే ఇదే ఏనుగు బుసానికురప్పల్లె గ్రామంపై పడి ఓ వృద్ధుడిని కాళ్లతో తొక్కి చంపేసింది.
- మదనపల్లెలో డ్రామా చూసి సీటీఎం మీదుగా వాయల్పాడు వెళ్తున్న తండ్రీ కొడుకులపై ఏనుగులు దాడి చేసి చంపేశాయి. అయిదేళ్ల క్రితం జరిగిన ఈ ఘటన అప్పట్లో సంచలనం రేకెత్తించింది. ఇలా ఇప్పటికే అనేక మంది ఏనుగుల గుంపు చేతిలో మృత్యువాత పడ్డారు.
- పదేళ్ల కిందట ఇదే మండలం చిన్నకంపెడ్డిగారిపల్లె సమీపంలోని వ్యవసాయ పంట పొలాలపై ఏనుగుల గుంపు పడి పంటను ధ్వంసం చేశాయి.
- 15 ఏళ్ల క్రితం కంభంవారిపల్లె మండలం జిల్లేళ్లమంద సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఏనుగుల గుంపు సంచరించింది. వ్యవసాయ పంట పొలాలను ధ్వంసం చేయడమే కాక ఓ రైతును కూడా పొట్టన పెట్టుకున్నాయి.

కుంకీ ఏనుగులు ఏమయ్యాయి?

అటవీ ప్రాంతంలో ఉండే ఏనుగుల గుంపు దారి తప్పి గ్రామాల సమీపంలోకి వచ్చి పంటను ధ్వంసం చేయడం, ప్రాణ నష్టం కలిగించడం చేస్తుంటాయి. ఇలాంటి ఏనుగుల గుంపును తరమడానికి అటవీశాఖ అధికారులు పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్న కుంకీ ఏనుగులను వినియోగిస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రామకుప్పంలో ఈ కుంకీ ఏనుగులు ఉన్నాయి. వీటి ద్వారా ఇక్కడ నక్కి ఉన్న ఏనుగుల గుంపును తరిమివేసే అవకాశం ఉన్నా అధికారులు ఈ చర్యలు ఎందుకు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలో కుంకీ ఏనుగుల బృందంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వీటిని రప్పించాలని కోరుతున్నారు.

బాధ్యులెవరు?

పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు సంచారం విషయం అటవీశాఖ అధికారులకు తెలిసినా ముందస్తుగా సమీప ప్రాంతాలను హెచ్చరించి ఉంటే ప్రాణనష్టం జరిగేది కాదు. పులిచెర్ల, సోమల, చౌడేపల్లె, పులిచెర్ల అటవీ ప్రాంతాల్లో తరచూ ఏనుగుల సంచారం అధికంగా ఉంటుంది.

ప్రాణ భయంతో ఏనుగులు : దారి తప్పి పంట పొలాలపై పడే ఏనుగుల గుంపు పిల్ల ఏనుగుల రక్షణకు ప్రాధాన్యమిస్తాయి. ఈ క్రమంలో కంట పడ్డ వారిని సైతం ప్రాణ భయంతోనే తొక్కి చంపే పరిస్థితి ఉంటుంది. ఏనుగుల గుంపును చూడానికి జనాలు తరలి రావడంతో ఎటూ పోలేని స్థితిలో అవి ఉంటాయి. జనసంచారం తగ్గాక అవే వెళ్లిపోతాయి. వాటి జోలికి వెళ్లడం అత్యంత ప్రమాదకరం.

\- శ్రీనివాసులు, ఏడీఎఫ్‌వో, మదనపల్లె

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా బీసీ జనార్దన్‌రెడ్డి



ఈనాడు, కడప: అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా బనగానపల్లె ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా వ్యవహరిస్తూ.. జిల్లాలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, పాలనాపరమైన వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. ఈ నియామక ఉత్తర్వులు తెలుగులో జారీ చేయడం విశేషం. ఇకపై మంత్రి జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ), జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు మంత్రి హాజరుకానున్నారు.

జడ్పీ సీఈవోగా ఓబులమ్మ బాధ్యతల స్వీకరణ



కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జిల్లా పరిషత్ సీఈవోగా చిలమకూరు ఓబులమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనంతపురం జడ్పీ సీఈవోగా (ఎఫ్‌ఏసీ) పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఈవోగా పనిచేస్తున్న ఎం.సుధాకర్‌రెడ్డిని పుట్టపర్తి డీఎల్‌డీవోగా బదిలీ చేసిన విషయం విదితమే. గత నెల 22వ తేదీనే బదిలీ ఉత్తర్వులు వచ్చినా, ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహీ సేవ, స్వర్ణాంధ్రప్రదేశ్-2047, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలతో పాటు పింఛన్ల పంపిణీ ఉండడంతో ఈ నెల 2వ తేదీ వరకు పాత స్థానాల్లోనే పనిచేయాలని సూచించారు. అనంతరం 3, 4 తేదీల్లో ఓబులమ్మ బాధ్యతలు చేపడతామరని భావించినా రాలేదు. దీంతో ఆమె రాకపై సందిగ్ధత నెలకొంది. ఎట్టకేలకు పది రోజుల తర్వాత ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఓబులమ్మ మాట్లాడుతూ... సిబ్బంది సహకారంతో జడ్పీని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. అనంతరం ఆమె కడప కలెక్టరు లోతేటి శివశంకర్‌ను, జడ్పీ ఛైర్‌పర్సన్ జేష్యాది శారదను మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్పీ వైస్ ఛైర్మన్ పిట్టు బాలయ్య, రాజశేఖర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి, పరిపాలనాధికారులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, నాగభూషణం, ప్రభాకర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, ప్రభాకర్, విజయభాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వర్‌రెడ్డి, సి.శ్రీనివాసులరెడ్డి తదితరులు సీఈవోను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

కౌండిన్య నుంచే గజరాజుల రాక!

కౌండిన్య అభయారణ్యం నుంచి గజరాజులు వచ్చినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. చిత్తూరు జిల్లా పరిధిలోని కారిడార్‌లోనే ఏనుగులు ఆవాసం పొందుతున్నాయి. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో దారితప్పి పీలేరు వైపునకు వచ్చినట్లు జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్ సింగ్ తెలిపారు. గుంపులో మొత్తం 16 వరకు ఏనుగులు ఉండగా.. వాటిలో నాలుగు గున్న ఏనుగులు ఉన్నట్లు వివరించారు. చిత్తూరు జిల్లాలోని పులిచెర్ల అటవీ ప్రాంతం నుంచి పీలేరు మండలం కొత్తపల్లి వైపునకు గజరాజులు చేరుకున్నట్లు అంచనా వేశారు. ఇవి రైతు రాజారెడ్డిపై దాడి చేసి చంపేయడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తదుపరి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గజరాజులను కౌండిన్య కారిడార్‌లోకి తరలించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో కారిడార్ వెంట ఏనుగులు తిరుగుతూ తరచూ పంట పొలాలు నాశనం చేస్తున్నాయి. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక సరిహద్దు స్థావరంగా ఏనుగులు తరచూ దాడులకు పాల్పడుతున్నాయి. పంటలను నాశనం చేయడంతో పాటు రైతులను పొట్టన పెట్టుకుంటున్నాయి. గజరాజుల యుద్ధకాండ నుంచి కాపాడటానికి ఇది వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కర్ణాటక రాష్ట్ర సర్కారుతో సంప్రదించి 8 కుంకీ ఏనుగులు తీసుకొచ్చే ప్రయత్నాలు చేశారు. గజరాజులు నివాసాలు, పంట పొలాలపై దండెత్తినప్పుడు అదుపు చేయడానికి ఇబ్బందిగా మారింది. ఈ తరుణంలో తర్ఫీదు ఇచ్చిన కుంకీ ఏనుగులను రంగంలోకి దింపి కట్టడి చేయడానికి ఉపయోగపడతాయి. చిత్తూరు జిల్లాలో జయంత్, వినాయక్ అనే కుంకీలున్నాయి. వీటిని కౌండిన్య అడవుల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ననియాల సంరక్షణ కేంద్రంలో ఉంచారు. జయంత్ వయస్సు 55, వినాయక్‌కు 66 ఏళ్లు కావడంతో వృద్ధాప్య సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదించి కుంకీ ఏనుగులు ఇక్కడికి తరలింపునకు ఒప్పందం చేసుకుంది. త్వరలో చేరుకునే అవకాశాలున్నాయి. ఈలోపు పీలేరు ప్రాంతం నుంచి గజరాజుల్ని తరమడానికి టపాకాయలు పేల్చుతూ దాదాపు చిత్తూరు సరిహద్దుల వరకు మంగళవారం రాత్రికి చేర్చారు. వీటిపై ప్రత్యేకంగా నిఘా పెట్టడంతో పాటు పరిసర గ్రామాల ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. **- ఈనాడు, కడప**

మరో మూడు రోజుల పాటు వర్షాలు

ఇరు జిల్లాలకు రెడ్ అలెర్ట్! అత్యవసర ఖర్చులకు రూ.కోటి విడుదల నేటి నుంచి భారీ వానలంటూ హెచ్చరిక

ఈనాడు, కడప



పెనగలూరు మండలం నారాయణ నెల్లూరు వద్ద నేలవాలిన రైతు చెంగల్రాయుడుకు చెందిన వరి పంట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా రూపాంతరం చెందనుంది. గురువారం నాటికి చెన్నై సమీపంలో తీరం దాటుతుందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో బుధవారం నుంచి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో అన్నమయ్యతో పాటు వైఎస్ఆర్ జిల్లాకు అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదు కావడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. అక్కడక్కడ వరి పంట నేలవాలిపోయింది. ఇకపై భారీ వర్షాలు కురిసే పక్షంలో నేలవాలిన పంట కుళ్లిపోయే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కాస్త ఉపశమనం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లా స్థాయిలో కలెక్టర్లతో పాటు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉంటోంది. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడంతో బాధితులు సమాచారం అందించి సహాయం పొందడానికి ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు అందుబాటులోకి తెచ్చారు. సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీలు ఆయా స్థానాల్లోనే పరిస్థితిని సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉంటున్నారు. మంగళవారం పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు. బుధవారం నుంచి వానలు భారీగా కురిసే అవకాశం ఉందనే అంచనాలతో ఉన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లాకు రూ.కోటి నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులతో భారీ వర్షాలు కురిసే ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి రిలీఫ్ క్యాంపులు, రక్షిత తాగునీరు, ఆహారం, ఆరోగ్య శిబిరాలు, పారిశుధ్య కార్యక్రమాల కోసమే అత్యవసర నిధులు వినియోగించాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవాలని, విపత్తులు ఎదురయ్యే పక్షంలో వెంటనే సహాయక చర్యలు చేపట్టడానికి ఎస్డీఆర్ఎఫ్, రహదారులు/ భవనాలు, పురపాలక, పంచాయతీరాజ్‌శాఖల బృందాలను వినియోగించుకోవాలని సూచించింది. పరిస్థితిని బట్టి రాష్ట్ర ప్రభుత్వం నుంచి హెచ్చరికలు, సూచనలు కలెక్టర్ల కార్యాలయాలకు అందుతున్నాయి. తుపాను తీరం దాటే సమయంలో రెండు జిల్లాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

పల్లె సీమల ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



వండాడిలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అధికారులు, నాయకులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: పల్లె సీమల ప్రగతే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చిన్నమండెంలోని బలిజపల్లెలో రూ.40 లక్షలు, దేవగుడిపల్లెలోని రాజీవ్‌కాలనీలో రూ.20 లక్షలు, కొత్తపల్లె పంచాయతీలోని శ్రీరామనగర్ కాలనీలో రూ.13.50 లక్షలు, వండాడి గ్రామం తూర్పుపల్లి నుంచి గొర్లముదివేడు క్రాస్, దళితవాడల్లో రూ.1.10 కోట్ల నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు మంగళవారం మంత్రి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు, విద్యుత్తు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక వసతులన్నీ సమకూరుస్తామన్నారు. భూమి పూజ పనులన్నీ వచ్చే సంక్రాంతి లోపు పూర్తి చేస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, ఇంజినీరింగు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

హంద్రీనీవా విస్తరణా? లైనింగా?

ఇటీవల చేపట్టిన పనులు ఆపేస్తూ నిర్ణయం
మంత్రి నిమ్మల సమీక్షతో సర్వత్రా చర్చ

ఈనాడు, కడప



హంద్రీ-నీవా కాలువ రేఖా పటాన్ని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు (పాత చిత్రం)

హంద్రీ-నీవా విస్తరణ పనులు చేపట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నీళ్లే రాని పరిస్థితిలో కాలువ విస్తరణతో ప్రయోజనం ఏమిటనే ప్రశ్న తలెత్తింది. ఈ పరిస్థితిలో కాలువ విస్తరణ కన్నా... లైనింగ్ పనులు చేపట్టడం ద్వారా వృథా కాకుండా సాగునీరు సాఫీగా వెళ్లడానికి అవకాశం ఉంటుందని భావిస్తోంది. తద్వారా నిర్వహణకు సులభతరంగా ఉంటుందనే అంచనాకు వచ్చింది. దీంతో చేపట్టిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలనే నిర్ణయం తీసుకున్నారు. ● హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచేలా వెడల్పు పనులు చేపట్టాలని వైకాపా ప్రభుత్వం భావించింది. అయితే పనులు చేపట్టిన దాఖలాల్లేవు. టెండర్లు చేపట్టి.. గుత్తేదారును ఎంపిక చేయగా.. చివరలో బిల్లుల విషయంలో సందేహం తలెత్తడంగా పనులు చేపట్టలేదు. కాలువలో కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేదు. ఈ పరిణామ క్రమంలో వైకాపా అధికారం కోల్పోవడం, ఎన్డీఏ పగ్గాలు చేపట్టడంతో గుత్తేదారులో ధైర్యం వచ్చింది. ఇటీవల జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో హంద్రీ-నీవా కాలువ, జలాశయాలను రెండు రోజుల పాటు పరిశీలించారు. రాయలసీమ కరవు రైతుల జీవనాడి హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకం కింద అన్నమయ్య జిల్లాలో శ్రీనివాసపురం, అడవిపల్లె జలాశయాలు నిర్మించారు. గత తెదేపా హయాంలో ఫేజ్-2 కింద అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 26 టీఎంసీలు వినియోగించుకుని 4.05 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతలవారిపల్లె వద్ద కాలువ 75 కి.మీ నుంచి కుప్పం బ్రాంచి కాలువ మార్గంలో 207 కి.మీ వరకు విస్తరణ పనులు చేపట్టాలని భావించారు. గత అయిదేళ్లుగా కాలువలో నీరే పారలేదు. పైభాగం నుంచి నీరు కిందకు రావడంలేదు. ఈ విస్తరణ పనుల కోసం రూ.1,300 కోట్లు వెచ్చించాలనే నిర్ణయంతో గుత్తేదారును గత ప్రభుత్వంలో ఖరారు చేశారు. మంత్రి నిమ్మల కాలువ పరిశీలన అనంతరం అనుమతి లేకుండా ఇంజినీరింగ్ అధికారులు విస్తరణ పనులు చేపట్టారు. నీళ్లు రాని పరిస్థితిలో కాలువ విస్తరణ ఎందుకంటూ వివిధ రూపాల్లో సలహాలు వచ్చాయి. ఈ పరిస్థితిలో విస్తరణ కంటే కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులు చేయాలనే సూచనలు అందాయి. ఈ నేపథ్యంలో మంత్రి.. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకునే వరకు తదుపరి పనులు చేపట్టవద్దని, లైనింగ్ పనుల ఆవశ్యకతను ఆయన దృష్టికి తీసుకెళ్లాలనే అభిప్రాయానికి వచ్చారు. విస్తరణ కంటే లైనింగ్ పనులుపై ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. ఉన్న కాలువలో అంతరాలు లేకుండా పారించాలనే అభిప్రాయానికి వచ్చారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సైతం విస్తరణ కంటే లైనింగ్ పనులు చేపట్టడం ద్వారా నీటి ప్రవాహానికి మార్గం సుగమమం అవుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇప్పట్లో విస్తరణ ఆవశ్యకత లేదని, ఉన్న కాలువలో సాగునీరు పారించడానికి ప్రయత్నాలు చేయాలని సూచించారు.

రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా విజయకుమార్‌నాయుడు



వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా యోగి వేమన విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ సహ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ బోయ విజయకుమార్‌నాయుడు నియమితులయ్యారు. ఈయన విశ్వవిద్యాలయంలో శాఖాధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, ట్రాన్స్‌పోర్ట్ విభాగ సమన్వయకర్తగా, వైవీయూ ప్రవేశాల సహాయ సంచాలకులుగా, న్యాక్ కోర్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. పలు ప్రాజెక్టుల్లో పరిశోధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌నాయుడిని వైవీయూ వీసీ కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.పద్మ, అధ్యాపకులు అభినందించారు.

వైభవంగా పట్టాభి రాముడి పవిత్రోత్సవాలు



పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : తితిదే ఆధ్వర్యంలోని పట్టాభి రామాలయంలో రెండు రోజులుగా స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యసేవలు జరిగాయి. ఉదయం 7 గంటలకు యాగశాల వైదిక కైంకర్యాల నిర్వహణ అనంతరం పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలోని ఊంజల్ మండపంలో స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు యాగశాల కైంకర్యాలతో రెండో రోజు కార్యక్రమాలు ముగిశాయి. వేడుకల్లో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణరాజ్ భట్టార్, బాషికా చార్యులు, కుమార్ స్వామి, తితిదే అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

రాయచోటి, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో 16వ తేదీ బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంగళవారం సెలవు ప్రకటించారు. జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలన్నారు. ఈ ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి బదిలీ

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో కర్నూలు జిల్లాలో డీఎల్‌డీవోగా పనిచేస్తున్న బాలకృష్ణారెడ్డిని డీపీవోగా నియమించారు. డీపీవో ధనలక్ష్మిని తిరుపతిలోని జిల్లా పంచాయతీ కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి రెండేళ్ల పాటు ధనలక్ష్మి డీపీవోగా కొనసాగారు.

రోడ్డంతా తవ్వేసి... కష్టాలకు వదిలేసి



పాపఘ్ని నదిపై అసంపూర్తిగా వంతెన



లక్కిరెడ్డిపల్లి-చక్రాయపేట మధ్య ఆంజనేయపురం వద్ద సగం తారు పరిచి వదిలేశారిలా...

మూడేళ్లుగా పూర్తికాని విస్తరణ పనులు

ఈనాడు, అన్నమయ్య, న్యూస్‌టుడే-రాయచోటి: రహదారుల విస్తరణ పనులకు మూడేళ్లుగా గ్రహణం వీడడం లేదు. పనులు చేపట్టి రహదారిని తవ్వేసి వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ఎన్‌డీబీ కింద ఏడు రహదారుల విస్తరణ పనులను మూడేళ్ల కిందట చేపట్టారు. అందులో భాగంగా రాయచోటి-వేంపల్లె ప్రధాన రహదారి 53.6 కిలో మీటర్ల మేర విస్తరణ పనులు రూ.450 కోట్లతో మొదలయ్యాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఏడాదిన్నర కిందట మృతి చెందారు. దీంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అధికారులు గుత్తేదారుతో చర్చించి మరో గుత్తేదారుకు పనులప్పగించారు. ● రాయచోటి రింగ్ రోడ్డు నుంచి వేంపల్లె వరకు రహదారిని పూర్తిగా విస్తరింపజేశారు. ఈ రహదారిపై మద్దిరేవుల, చక్రాయపేట, వేంపల్లె సమీపంలోని పాపఘ్ని నదిపై వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక్కడ డైవర్షన్ రోడ్లు వేసి వంతెన పనులు చేసినా అసంపూర్తిగా వదిలేశారు. లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, పాయలోపల్లి సమీపంలో రహదారి విస్తరణకు భూ సేకరణ చేయాల్సి ఉన్నా ఆ పనులు కొలిక్కి రాలేదు. గుత్తేదారులు చేయించిన పనులకు బిల్లులు చెల్లించాలని అప్పటి వైకాపా ప్రభుత్వానికి నివేదించినా తీవ్ర జాప్యం చేసింది. దీంతో తాము పనులు పూర్తి చేయలేమని గుత్తేదారులు మిన్నకుండిపోయారు.

తరచూ ప్రమాదాలు...

రాయచోటి-లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, వేంపల్లె, ఎర్రగుంట్ల మీదుగా చాగలమర్రి వరకు ఉన్న ఈ రహదారి రాష్ట్ర రహదారి నుంచి జాతీయ రహదారిగా మార్చారు. అయినప్పటికీ పనుల్లో పురోగతి లేకపోవడంతో ఏళ్ల తరబడి ఈ మార్గంలో వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. కంకరపరిచి వదిలేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఈ విషయమై జాతీయ రహదారి ఏఈ రఘునాథబాబు మాట్లాడుతూ.. సంబంధిత గుత్తేదారు మృతి చెందడంతో పనులు ఆలస్యమయ్యాయని.. త్వరలోనే పూర్తి చేస్తామని వివరించారు.

స్పందనకు వందనం

పరిమళించిన మానవత్వం

బాధితుడికి మాజీ ఎమ్మెల్యే రూ.లక్ష వితరణ

బాలంవారిపల్లె (పీలేరు), న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో రెండు చేతులు, కాలు కోల్పోయిన తెల్లావుల దేవేంద్రకు మంగళవారం పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి రూ.లక్ష వితరణ చేశారు. ఈనాడులో మంగళవారం 'ఇంజినీరు అవ్వాలని ఉంది' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మంగళవారం పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ తూగుంటపల్లెలోని దేవేంద్ర ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. మనోధైర్యంతో బీటెక్ చివరి ఏడాది పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఆర్థికసాయం అందించినందుకు విద్యార్థి తల్లిదండ్రులు కృష్ణయ్య, భారతి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థులు వెంకట్రమణారెడ్డి, వెంకట్రమణ పాల్గొన్నారు.


విద్యార్థి దేవేంద్రకు రూ.లక్ష నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి, నాయకులు

వైకాపాకు క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడి రాజీనామా


జాన్‌బాబు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : వైకాపా అనుబంధ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు జాన్‌బాబు తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం రాత్రి ఆయన తన రాజీనామా పత్రాన్ని విడుదల చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మట్లి తొగటపల్లిలో మంగళవారంతో చౌడేశ్వరిదేవి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో అలంకరించి పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేల్చుతూ జ్యోతుల విన్యాసాల నడుమ ఊరేగించారు. ఈ ఉత్సవాలకు మదనపల్లె, ఎల్లహంక, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


మట్లిలో ప్రత్యేక వాహనంలో చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపు

ఇసుక క్వారీల పరిశీలన

కోమంతరాజపురం(పెనగలూరు),న్యూస్‌టుడే: మండల పరిధిలో నూతనంగా మంజూరు అయిన రెండు ఇసుక క్వారీల ప్రాంతాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ నైదియా దేవి పరిశీలించారు. నారాయణనెల్లూరు, కోమంతరాజపురం ఇసుక క్వారీ ప్రాంతాలను మంగళవారం ఆమె పరిశీలించి స్టాక్ పాయింట్ ఎక్కడా అనేది అడిగి తెలుసుకున్నారు. అనంతరం శింగనమల చెరువును పరిశీలించారు. తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణీ, ఆర్ఐ రాజశేఖర్, సాగునీటిశాఖ జేఈ దయానంద, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, కొండయ్య, పోలీసులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో పంటలకు రక్ష

రైతులకు శాస్త్రవేత్తల సూచనలు


ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం

కలికిరి గ్రామీణ, చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : జిల్లాలో తుపాను కారణంగా నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సాగులో ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక పోవడంతో ఈ వర్షంతో పంటలకు మేలు జరిగినా పురుగులు, తెగుళ్లు ఆశించి నష్టం వాటిల్లే పరిస్థితులు కూడా ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించి వర్షాల తరువాత సస్యరక్షణ చర్యలు చేపడితే పంటలను కాపాడుకోవచ్చని కలికిరి కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, సమన్వయకర్త కె.మంజుల, సీకేదిన్నె కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య, ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సునీల్ కుమార్, ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్య కుమార్ సూచిస్తున్నారు.

వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అధిక వర్షాలతో తోటల్లో నీరు నిల్వ ఉండడంతో వేర్లు కుళ్లిపోయి పంట దెబ్బతింటుంది. సాగులో ఉన్న పంటల్లో రైతులు నీటి నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలకు విద్యుత్తు తీగలు కిందపడి ఉండడంతో రైతులు విద్యుదాఘాతానికి గురై ప్రమాదాల బారినపడుతుంటారు. పగటి వేళల్లోనే పొలాలకు వెళ్లి నీటి నిల్వలను తొలగించడం, కాలువలు తీసి నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టాలి. జిల్లాలో వరి, వేరుసెనగ, పసుపు, చామంతి, మినుము, మొక్కజొన్న, అరటి, బొప్పాయి, తమలపాకుల తోటలు, కంది, ఆముదం, ఉల్లి తదితర పంటలు సాగులో ఉన్నాయి. అధిక వర్షాలతో వివిధ రకాల తెగుళ్లు, పురుగులు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణ చర్యలు చేపడితే పంటలను కాపాడుకోవచ్చు.

వరి నారుమడిలో సస్యరక్షణ

అధిక వర్షాలతో వరి నారుమడిలో ఆకుముడత, కాండం తొలిచే పురుగు, ఉల్లికోడు పురుగు ఆశించే అవకాశం ఉంది. 21 రోజుల సెంటు నారుమడిలో 160 గ్రాముల గుళికలు పలుచగా చల్లుకోవాలి. వరినాటు వేసే సమయానికి ఈ మూడు తెగుళ్లను నివారించుకోవచ్చు. జిల్లాలో కేసీ కాలువతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా రైతులు వరి సాగు చేస్తున్నారు. కొంత మంది ఇప్పటికే బోరుబావుల కింద ఉన్న నీటితో సాగు చేశారు. అయితే ఈ పంటలో ప్రస్తుత వర్షాలకు కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు ఫ్లుబెండమైడ్ 0.25ఎంఎల్ ఒక లీటరు నీటికి లేదా కోరాజిన్ 0.3ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు నత్రజని ఎరువులను వాయిదా వేసుకొని మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 20 కిలోల చొప్పున పంటలో నీరు తగ్గిన తర్వాత పలుచగా నీరు ఉన్న సమయంలో వేయాలి.


వీరయ్య


సునీల్‌కుమార్


అంకయ్యకుమార్

చామంతిలో : జిల్లాలో సీకేదిన్నె, పెద్దమద్ది, వేంపల్లె, ఖాజీపేట, దువ్వూరు, వీరపునాయునిపల్లె ప్రాంతాల్లో చామంతి తోటలను అధికంగా సాగు చేస్తున్నారు. అధిక వర్షాలు పడిన సమయంలో ఇందులో వేరు కుళ్లు ఆకుమచ్చ తెగులు ఆశించి పంటను పూర్తిగా నష్టపరుస్తాయి. వర్షాలు ఎక్కువగా కురిసిన సమయంలో పంటలో నీరు నిల్వ ఉండకుండా బయటకు తొలగించాలి. లేదంటే నీరు మొక్కల వద్దనే నిల్వ ఉంటే మొక్కలు కుళ్లిపోతాయి. చామంతిలో వేరుకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా రిడోమిల్ ఎంజెడ్ 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఆకు మచ్చ తెగులు నివారణకు కార్బెండిజమ్ ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా హెక్సాకోనజోల్ 2ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వేరుసెనగ పంట : వేరుసెనగ పంటకు టిక్కా ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు హెక్సాకోనజోల్ 2ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చు పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4ఎంఎల్ లీటరు నీటికి పిచికారీ చేయాలి.

పత్తి పంటలో : పత్తి పంటకు ఈ వర్షాల వల్ల గులాబీ రంగు పురుగు ఆశించవచ్చు. పూత, పిండె దశలో ఉన్నట్లయితే 5 శాతం వేపగింజల కషాయం కానీ లేక 5మి.లీ వేప నూనె ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే పత్తి పంటలో గులాబీ రంగు రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చని తెలిపారు.

అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే: అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. భారీ విపత్తును సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉంటోందన్నారు. రైల్వేకోడూరులో రెండు రోజులుగా 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. అక్కడి పరిస్థితిని అంచనా వేసేందుకు శెట్టిగుంట చెరువు, గుంజనేరు నది పరిధిలోని ధర్మపురం కాలనీ, ఆంజనేయ కాలనీ, గాంధీ కాలనీ, నరసరాంపేటలలో డ్రోన్ ద్వారా సర్వే చేసి వరద పరిస్థితిని అంచనా వేస్తామన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నందు వల్ల ఎగువ ప్రాంతం నుంచి రైల్వేకోడూరు, మదనపల్లె, పీలేరు ప్రాంతాలలో వరద తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఆయా డివిజన్ల సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని స్థానిక అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో మూడు ఇసుక రీచ్‌లకు 22 టెండరు దరఖాస్తులు వచ్చాయని తక్కువ ధరకు కోట్ చేసిన వారికి నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 08561-293006 నెంబరుకు సమాచారం అందిస్తే వెంటనే సహాయక చర్యలు చేపడతామన్నారు. కంట్రోల్ రూంలో 24/7 సిబ్బంది విధుల్లో ఉంటారని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : తుపానును ఎదుర్కొనేందుకు డివిజన్ కేంద్రంలో మూడు కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రానున్న రెండు రోజుల వరకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా రోడ్డుపై వాగులు, వంకలు పొంగి పొర్లుతుంటే దాటే ప్రయత్నాలు చేయకూడదని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు మానుకోవాలన్నారు. ఈ రెండు రోజులపాటు బయట తిరగకుండా జాగ్రత్తపడాలన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. 16న ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 99891 76247, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 94908 27676 నంబరు, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు 63033 08475 నంబర్లు అందుబాటులో ఉంటాయని, ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారమివ్వాలని కోరారు. సహాయక చర్యలు చేపట్టేందుకు అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

గుప్తనిధులకు ఆలయం కూల్చివేత

ములకలచెరువు న్యూస్‌టుడే : గుప్తనిధుల తవ్వకాల కోసం గుర్తుతెలియని వ్యక్తులు అభయాంజనేయస్వామి ఆలయాన్ని ధ్వంసం చేసిన సంఘటన అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రిగ్గులతో ఆలయాన్ని కూల్చేందుకు ప్రయత్నించగా వర్షం కారణంగా అవి పేలకపోవడంతో సుత్తి, గడ్డపార్లతో ఆలయాన్ని కూల్చివేశారు. పోలీసులు, అర్చకుల వివరాల మేరకు.. ములకలచెరువు మండలం కదిరినాథునికోట పంచాయతీ ములకలచెరువుకు సమీపంలో 16వ శతాబ్దంలో కనుగొండ రాయస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయానికి ఎదురుగా బండపై అభయాంజనేయ స్వామి శిల్పాన్ని చెక్కి ఆలయాన్ని ఏర్పాటు చేశారు. గతంలో కూడా ఈ ఆలయం వద్ద బండపై చెక్కిన అభయాంజనేయ స్వామి కళ్లకు గంతలు కట్టిన దుండగులు గుప్త నిధులు కోసం తవ్వకాలు జరిపారు. 12 ఏళ్ల కిందట బండపై చెక్కిన అభయాంజనేయ స్వామికి ఆలయాన్ని నిర్మించి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రిగ్గులు, నాట్లతో ఆలయాన్ని కూల్చేందుకు ప్రయత్నించారు. వర్షం కారణంగా రిగ్గులు, నాట్లు పేలకపోవడంతో రిగ్గులకు ఏర్పాటు చేసిన వైర్లు కాలిపోయాయి. ఆ గుర్తులు ఆలయ గోడపై కన్పిస్తున్నాయి. ఎలాగైనా ఆలయాన్ని కూల్చేయాలనే ఉద్దేశంతో సుత్తి, గడ్డపార, ఇతర పరికరాలతో గోడను కిందిభాగం నుంచి తొలగించారు. దీంతో ఆలయం ఒకవైపునకు కూలిపోయింది. ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వదిలేశారు. కొండ ప్రాంతంలో ఆలయం ఉండడంతో ఉదయం వరకు విషయం ఎవరికీ తెలియలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. ఆలయాన్ని కూల్చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెదేపా నేత జయచంద్రారెడ్డి పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.


దుండగులు కూల్చేయడంతో ఓ వైపునకు వాలిన అభయాంజనేయస్వామి ఆలయం

సినీనటి రమాప్రభ సోదరి కుమారుడు మృతి


బొరుగుల సురేష్ (పాతచిత్రం)

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : సినీనటి రమాప్రభ సోదరి కుమారుడు, నిర్మాత బొరుగుల సురేష్ అలియాస్ చెన్నై చిన్నా సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రాష్ట్ర విభజన జరగక ముందు ఆయన కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే టికెట్టు కోసం తీవ్రంగా పోటీ పడ్డారు. ఆ సమయంలో భారీ విందు ఏర్పాటు చేయించారు. ఈ విందు అప్పట్లో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆయన భౌతికకాయాన్ని మదనపల్లెకు తీసుకొచ్చి అంత్యక్రియలు చేయనున్నారు. బుధవారం పట్టణంలోని పంచరత్న థియేటర్ సమీపంలోని బంధువుల ఇంటి వద్ద భౌతికకాయాన్ని అభిమానుల సందర్శనార్థం ఉంచి అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్...


సతీష్‌కుమార్‌రాజు (పాత చిత్రం)

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కొండూరు సతీష్‌కుమార్‌రాజు (36) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రవీంద్రబాబు తెలిపారు. శిబ్యాల గ్రామం వైకుంఠరాచపల్లెకు చెందిన ఈయన ఈ నెల 10వ తేదీ రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కారు ఢీకొని రైతు దుర్మరణం

ములకలచెరువు, న్యూస్‌టుడే : కారు ఢీకొట్టడంతో రైతు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండల పరిధిలో చోటు చేసుకుంది. ములకలచెరువు మండలం కదిరినాథునికోట పంచాయతీ నాయునివారిపల్లికి చెందిన శ్రీనివాసులు (56) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై ములకలచెరువుకు వెళ్లారు. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా కదిరినాథునికోట క్రాస్ వద్ద మదనపల్లె నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు, కుటుంబ సభ్యులు ములకలచెరువు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసులు సోమవారం రాత్రి మృతి చెందారు. 108 వాహనం ఆలస్యంగా రావడంతో శ్రీనివాసులు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈపీకేలో రాయచోటి ప్రథమం

పీలేరు, న్యూస్‌టుడే : దసరాకు స్వగ్రామాలకు వచ్చిన ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడంలో అన్నమయ్య జిల్లాలో రాయచోటి డిపో ప్రథమస్థానంలో నిలచింది. రాయచోటి కిలోమీటరుకు రూ.50.05 ఆదాయం, ఓఆర్ (సీట్ల ఆకుపేషన్ రేట్) 88.68 శాతంతో ప్రథమం, మదనపల్లె-1 ఈపీకే రూ.49.00, ఓఆర్ 90.70 శాతంతో ద్వితీయస్థానం, మదనపల్లె-2 ఈపీకే 47.91, ఓఆర్ 85.89శాతంతో తృతీయస్థానం, పీలేరు ఈపీకే రూ.44.43, ఓఆర్ 78.74శాతంతో నాలుగో స్థానం, రాజంపేట ఈపీకే రూ.44.26, ఓఆర్ 78.71 శాతంతో చివరి స్థానంలో నిలచింది.

దెబ్బతిన్న వరి పంటల పరిశీలన

నందలూరు, న్యూస్‌టుడే: నాగిరెడ్డి, పాటూరు గ్రామ పంచాయతీలల్లో సాగులో ఉన్న వరి పంటలు వర్షాల కారణంగా నేలకొరిగాయి. ఈ సందర్భంగా రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ స్థానిక అధికారలతో కలిసి మంగళవారం గ్రామాల్లో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్ట వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. ఏవో మల్లికార్జున, రైతు సేవా అధికారులు షణ్ముఖ శ్రీనివాస్, పుష్పాంజలి, సాయి ప్రియ, శ్రీనివాసులు పాల్గొన్నారు.


పాటూరులో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్, అధికారులు

అనర్హులను గుర్తించేందుకే భూముల పునఃపరిశీలన


రాఘవేంద్ర, ప్రత్యేక ఉప కలెక్టర్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : ప్రభుత్వ భూములు పొందిన అనర్హులను గుర్తించేందుకే ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని హంద్రీ-నీవా ప్రాజెక్టు భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలనపై రెవెన్యూ అధికారులు, వీఆర్వోలతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజిస్టర్ చేసిన అసైన్‌మెంటు భూముల పరిశీలన ఇప్పటికే పూర్తయ్యిందని, క్షేత్రస్థాయిలో విచారణ కూడా ముగించామన్నారు. రిజిస్టర్ చేయని భూములకు సంబంధించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో సేకరించామని, రికార్డులు తయారు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూముల పునఃపరిశీలనను ముగించడానికి రెవెన్యూ అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. బి.కొత్తకోట తహసీల్దారు మహమ్మద్ అన్సారీ మాట్లాడుతూ మండలంలో ఫ్రీహోల్డ్ భూములు 6,162 ఎకరాలు ఉన్నట్లు గుర్తించి పునఃపరిశీలన చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు తమకు అందిన వివరాల ఆధారంగా ఫ్రీహోల్డ్ భూములు పొందిన అనర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నామన్నారు. బి.కొత్తకోట మండల సహకార సంఘం తరపున గోదాము నిర్మాణానికి రెండెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని బ్యాంకు సీఈఓ ఆదినారాయణ ప్రత్యేక కలెక్టర్‌ను కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న గోదాము కోసం రోడ్డు సదుపాయం ఉన్న భూమి కావాలని కోరగా.. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దారును ఆదేశించారు.

జిల్లాలో ఇసుక రీచులకు టెండర్లు : కలెక్టర్

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌లకు సంబంధించి టెండర్లు ఇవ్వనున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వీరబల్లి, మట్లి రీచ్‌లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రావాల్సి ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2.55 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. పెనగలూరు కోమంతరాజపురం రీచ్‌కు సంబంధించి ఆరు, టంగుటూరు రీచ్‌కు 9, నారాయణనెల్లూరు రీచ్‌కు 7 టెండర్లు దాఖలయ్యాయని ఆయన పేర్కొన్నారు. దాఖలైన టెండర్లలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి సాంకేతిక మూల్యాంకనం చేసి త్వరలో పారదర్శకంగా తుది నిర్ణయం ప్రకటిస్తామన్నారు. అతి తక్కువకు కోడ్ చేసిన టెండరు దారులకు నోటీసులు జారీ చేసి పారదర్శకంగా టెండరు ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.


ప్రపంచం మెచ్చిన భారత రత్నం అబ్దుల్‌కలాం

రాయచోటి, న్యూస్‌టుడే: మానవతా విలువకు ప్రతీకగా, దేశ శాస్త్ర విజ్ఞాన రంగానికి మార్గదర్శిగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నిలిచారని ఎంపీ పి.మిథున్‌రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డిలు పేర్కొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యావేత్తగా, యువత ఆయన బాటలో నడవాలని ఆకాంక్షించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, నిస్సార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

ఆన్‌లైన్ బెట్టింగులు అరికట్టాలని వినతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మదనపల్లె డివిజన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాస్ నాయుడుతో పాటు పలువురు డీఎస్పీ కొండయ్యానాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పట్టణం, గ్రామీణ ప్రాంతం అని తేడా లేకుండా విస్తరిస్తోందన్నారు. క్రికెట్, గుర్రపుస్వారీ, ఆన్‌లైన్ జూదంతో యువత ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. దీనిపై కళాశాలలు, ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. డీఎస్పీ స్పందిస్తూ ఇప్పటికే కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంస్థలు, విద్యార్థి సంఘాలు అవగాహన పెంచాలన్నారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సహజీవన్‌బాబు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు వెంకటస్వామి, రమేష్‌నాయుడు, బద్రి, చక్రపాణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీ కొండయ్యనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సైనికుల సంఘం నాయకులు

తెగిన చెరువులు... ఆయకట్టుకేవీ నీళ్లు?

- గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుదేలు
- కూటమి ప్రభుత్వంపైనే అన్నదాతల ఆశలు

పీలేరు, కేవీపల్లె, న్యూస్‌టుడే: సాగునీటి వనరుల మరమ్మతుల విషయంలో గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం చేయడం రైతులకు శాపంగా మారింది. రాష్ట్రంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం చెరువులను మరమ్మతులు చేస్తోందని రైతులు ఆశపడుతున్నారు. వర్షపు నీటిని వృథా కాకుండా పూర్వీకులు చెరువులు నిర్మించారు. వీటిల్లో నీరు నిల్వ ఉంటే చుట్టుపక్కల వ్యవసాయ బోర్లకు నీరు పుష్కలంగా అంది పంటలు సాగవుతాయి. కానీ అయిదేళ్లుగా వీటి మరమ్మతుల విషయంలో వైకాపా తాత్సారం చేయడంతో బోర్లలో నీరు అడుగంటిపోయి పంటలు సాగవడం గగనమవుతోంది. 2020 నవంబరులో వచ్చిన నివార్ తుపానుతో భారీ వర్షాలు కురవడంతో నదులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులను మళ్లీ బాగు చేసేందుకు జలవనరులశాఖ ఇంజినీర్లు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపినా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఫలితంగా దెబ్బతిన్న చెరువులు బాగు పడక కురిసిన వర్షాలకు నీరు వృథా అవుతున్నాయి.

★ పీలేరు మండలం తలపుల పంచాయతీ బయ్యారెడ్డిగారిపల్లె వద్ద వోటి ఒడ్డు మధ్యలో నీటి ఒత్తిడికి తెగిపోయింది. ఈవొడ్డు కింద 50 ఎకరాల వరి పొలాలుండడంతో పాటు బోర్ల నీటితో రైతులు పంటలు సాగు చేసేవారు. వొడ్డు మరమ్మతులు చేయనందున నాలుగేళ్లు వొడ్డు దిగువన పంటలు సాగవడం లేదు.

★ కంభంవారిపల్లె మండలం దేవాండ్లపల్లె వద్ద ఉన్న చెరువు కూడా 2020 నవంబరులో కుదిపేసిన నివార్ తుపానుతో దెబ్బతింది. ఇందులో నీరు నిల్వ ఉన్న పక్షంలో దిగువన 60 ఎకరాలకు సాగునీరు అందుతుంది. రెండు చెరువుల మరమ్మతులకు రూ.కోటితో ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరై చెరువులు బాగుపడితే సాగు, తాగు నీటికి ఇబ్బంది తీరుతుందని రైతులు ఆశించినా ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం చెరువుల కింద పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వమైనా అయినా చెరువులను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యపై పీలేరు జలవనరులశాఖ డీఈ ప్రసన్నకుమారి మాట్లాడుతూ చెరువుల మరమ్మతులకు అవసరమైన నిధుల విషయంలో ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాం. నిధులు మంజూరైన తరువాత చెరువులను బాగుచేసి వర్షపునీరు నిల్వ ఉండేటట్లు చూస్తామన్నారు.

జిల్లాలో చెరువుల వివరాలివి

పెద్ద చెరువులు	: 181
ఆయకట్టు	: 68,048.63 ఎకరాలు
చిన్నవి	: 3,115
సాగుభూమి	: 53,359.88
ఊట కాలువలు	: 33
తరి	: 5,998.86


కంభంవారిపల్లె మండలం దేవవాండ్లపల్లె వద్ద తెగిన చెరువు

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


భూమిపూజ చేస్తున్న తెదేపా నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు న్యూస్‌టుడే : గత వైకాపా పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధిలో వెనక్కి నెట్టారని తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ములకలచెరువులోని వినాయక్‌నగర్‌లో సీసీ రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, ఏపీడీ మధుబాబు, పారిశ్రామికవేత్త గిరిధర్‌రెడ్డి, నాయకులు త్యాగరాజు, కేవీ రమణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

రామసముద్రం, న్యూస్‌టుడే : విద్యుత్తు ప్రమాదాల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె డిస్కం డీఈఈ హరికుమార్ సూచించారు. రామసముద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తుపాను ప్రభావంతో మదనపల్లె డిస్కం డివిజన్ పరిధిలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చేపట్టినట్లు తెలిపారు. సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆదేశించినట్లు వివరించారు. ప్రజలు విద్యుత్తు తీగలు, స్తంభాలు తాకకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. పొలాల్లోని వ్యవసాయ నియంత్రికల వద్దకు వెళ్లరాదని రైతులను కోరారు. కార్యక్రమంలో డిస్కం ఏఈఈ మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలోనే విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కళాశాలలోనే ఓ విద్యార్థిని పినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మదనపల్లె పట్టణంలో మంగళవారం జరిగింది. మదనపల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని (19) పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఉదయం కళాశాలకు వచ్చిన ఆమె విరామ సమయంలో మరుగుదొడ్డిలోని పినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. విద్యార్థులు కేకలు వేయడంతో అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. ఎందుకు ఆత్మహత్యకు యత్నించిందో విద్యార్థిని చెప్పకపోవడంతో రెండోపట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

తండ్రి మందలించారని... : మదనపల్లె మండలం మేడిపల్లెకు చెందిన ఓ విద్యార్థిని (17) పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం కళాశాలకు సెలవు కావడంతో సీతాఫలం కాయలు కోసేందుకు వెళ్తుండగా తండ్రి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

లారీ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : లారీ ఢీకొని గుర్రంకొండ మండలం రేగడపల్లెకు చెందిన రామకృష్ణ (60) తీవ్రంగా గాయపడ్డారు. రామకృష్ణ ఈ నెల 14న సొంత పనిపై మదనపల్లెకు వచ్చారు. పని ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సోమవారం రాత్రి మదనపల్లెలోని బెంగళూరు బస్టాండు కూడలిలో ఉండగా వేగంగా వచ్చిన లారీ ఆయనను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒకటోపట్టణ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గొర్రె దొంగల అరెస్టు

ములకలచెరువు, న్యూస్‌టుడే : గొర్రెను దొంగలించిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై లోకేశ్‌రెడ్డి తెలిపారు. కర్ణాటకలోని కోలారు జిల్లా పాతూరుకు చెందిన తిప్పన్న, ఆర్, రాజేష్ సోమవారం కారులో తంబళ్లపల్లె మీదుగా శ్రీ సత్యసాయి జిల్లాలోని తిమ్మమ్మమర్రిమానుకు వెళుతుండగా తంబళ్లపల్లె మండలం ఆర్ ఎన్‌తాండ పంచాయతీ ఎద్దులవారిపల్లె వద్ద రెడ్డెప్పకు చెందిన గొర్రెల మందలోని ఓ గొర్రెను కారులో వేసుకుని పరారయ్యారు. స్థానికులు కేకలు వేయడంతో కారును ఆపకుండా ఉడాయించారు. గొర్రె చోరీపై రెడ్డెప్ప కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై లోకేశ్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం గుండ్లపల్లి వద్ద కారులో వెళుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి డిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఒకటో పట్టణ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మదనపల్లె పట్టణంలోని అప్పారావుతోటకు చెందిన షేక్ మహమ్మద్ రఫీక్‌భాయ్ తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతుండటంతో గతంలో అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో గతంలో ఒక కేసులో రూ.2వేల జరిమానా, మరో కేసులో ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. అతను జిల్లా కోర్టులో అప్పీల్ చేసుకోవడంతో మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జి అబ్రహం విచారణ నిర్వహించి మంగళవారం ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. దీంతో ఒకటో పట్టణ పోలీసులు నిందితుడిని జైలుకు తరలించారు.

ద్విచక్ర వాహనం విషయమై ఘర్షణ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ద్విచక్రవాహనం కుదువ విషయమై ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్న సంఘటన మదనపల్లె పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. పట్టణానికి చెందిన ఓ యువకుడు బుల్లెట్ వాహనం తనకు తెలిసిన వ్యక్తి వద్ద కుదవ పెట్టాడు. ఈ విషయమై ఇరువర్గాల వారు మల్లికార్జున కూడలి వద్ద పరస్పరం దాడులు చేసుకున్నారు. మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. స్థానికులు అడ్డుకునేందుకు యత్నించగా వారిపై కూడా దాడులు చేశారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఒకటోపట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోగా కొందరు పరారయ్యారు. కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. యువకులు మద్యం మత్తులో ఉండటంతో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు రెండోపట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన సానియా (25) బెంగళూరులో హౌస్ కీపింగ్ పని చేసేవారు. అక్కడే బెంగళూరుకు చెందిన రవీంద్రను ఏడేళ్ల కిందట వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా రవీంద్ర కట్నం కోసం వేధిస్తుండటంతో రెండు రోజుల కిందట పుట్టింటికి వచ్చారు. మంగళవారం రెండోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రవీంద్రపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గ్రామ కమిటీలతో సంఘాల బలోపేతం


మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన నాయకులు

పీలేరు గ్రామీణ : గ్రామ కమిటీలతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ బలోపేతమవుతాయని సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం పీలేరులో నియోజకవర్గ బాధ్యుడు గండికోట వెంకటేష్ ఎమ్మార్పీఎస్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నూతన కమిటీల ఏర్పాటుతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. నాయకులు రెడ్డెప్ప, వెంకట్రమణ, చరణ్‌కుమార్, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణకు ఊతం... గోకులాల నిర్మాణం


కంభంవారిపల్లెలో చెట్ల కింద కట్టేసిన పశువులు

కంభంవారిపల్లి, కలకడ, గుర్రంకొండ (న్యూస్‌టుడే) : యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్వగ్రామంలోనే ఉపాధి అవకాశాన్ని పశుపోషణ కల్పిస్తుంది. పశువులతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం ఆదాయాన్ని సమకూరుస్తోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం గోకులం పేరుతో షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. యువత స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం తగిన సహాయ, సహకారాలు అందిస్తోంది. 2014లో తెదేపా అధికారంలో ఉన్న సమయంలో ఈ పథకం అమల్లో ఉండేది. అప్పట్లో ఎంతో మంది అర్హులైన యువకులు లబ్ధిపొందారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఈ పథకాన్ని పట్టించుకోకపోవడంతో కనుమరుగైంది. దీంతో పశుపోషణపై ఆధారపడిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గోకులం పథకంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ పథకం అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రైతులు దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేశారు. అన్నమయ్య జిల్లాలో 1,200 గోకులం యూనిట్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించి, త్వరగా షెడ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్వగ్రామంలోనే ఉపాధి పొందవచ్చనే అభిప్రాయంతో యువత ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ముందుకు వస్తున్నారు. కంభంవారిపల్లె మండలానికి 50 గోకులం యూనిట్లు మంజూరయ్యాయి. నిర్మాణానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

షెడ్ల నిర్మాణాలకు సంబంధించి నిధుల వివరాలు

షెడ్డు పరిధి	యూనిట్ విలువ రూ.	రాయితీ రూ.	లబ్ధిదారుడి వాటా రూ.
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,500	18,500
6 కంటే ఎక్కువ	2,30,000	2,07,000	23,000
20 గొర్రెలు, మేకలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు, మేకలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లు	1,32,000	92,400	39,600

పథకానికి అర్హతలు

ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు పొంది ఉండాలి. చిన్న, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. దీనికి సంబంధించిన దరఖాస్తులు పశువైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తుతో పాటు భూమి రిజిస్ట్రేషన్ పత్రాల జిరాక్స్, జాబ్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం అందజేయాలని జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై తెలిపారు. పశువుల పెంపకానికి 90 శాతం రాయితీ, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి 70 రాయితీ ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ అరికట్టాలని వినతి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బహుజన యువసేన వ్యవస్థాపకుడు పునీత్, సభ్యులు

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : అన్నమయ్య జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలని బహుజన యువసేన వ్యవస్థాపకుడు పునీత్ మంగళవారం విజయవాడలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతులు లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో నిబంధనలు పాటించడం లేదని, ఫిర్యాదు చేసినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలతో కలిసి ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ఆసుపత్రిలో గత ప్రభుత్వం నియమించిన పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అర్హులైన వారికి ఉద్యోగాలు కేటాయించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు నాగరాజు, లక్ష్మీనారాయణ, జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

బాహుదా నది శుభ్రతకు చర్యలు


బాహుదా కాలువను జేసీబీ సాయంతో శుభ్రం చేయిస్తున్న పురపాలక సంఘం అధికారులు

మదనపల్లె పట్టణం,న్యూస్‌టుడే : తపాను నేపథ్యంలో పురపాలక సంఘం అధికారులు అప్రమత్తమయ్యారు. పట్టణంలో ప్రవహిస్తున్న బాహుదా నదిని శుభ్రం చేయించడానికి కమిషనర్ ప్రమీల చర్యలు చేపట్టారు. యంత్రం సాయంతో నదిలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. వరదనీరు వచ్చినా నిలిచిపోకుండా ప్రవహించేందుకు నదిని శుభ్రం చేయించారు. బెంగళూరు బస్టాండు వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు సీటీఎం రోడ్డుపై నిర్మించిన కాజ్‌వే వరకు నదిని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న 48 గంటల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పట్టణంలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు.

ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యం సాధించాలి


విద్యార్థులతో విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు, కరాటే శిక్షకుడు ఏఆర్ సురేష్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఆత్మరక్షణ విద్యలో విద్యార్థులు నైపుణ్యం సాధించాలని మదనపల్లె విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ కరాటే శిక్షకుల దినోత్సవం సందర్భంగా మదనపల్లె యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఆర్ సురేష్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్ విద్యార్థులకు, పట్టణానికి చెందిన పలువురు కరాటే శిక్షకులను సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆత్మరక్షణ విద్య అమ్మాయిలకు ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి ఒక శిక్షకుడిగా ఎదిగి కరాటే నేర్పించాలని కోరారు. అనంతరం వెలుగు ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల, వెలుగు వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మలేషియా గ్రాండ్ మాస్టర్ అనంతన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రధానోపాధ్యాయుడు మహేష్ నారాయణ, వెలుగు పాఠశాల నిర్వాహకుడు ఉదయ్‌మోహన్‌రెడ్డితో పాటు కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దహనంపై ఫిర్యాదు

మదనపల్లె పట్టణం,న్యూస్‌టుడే : నీరుగట్టువారిపల్లెకు చెందిన గంగోత్రి ఫంక్షన్‌హాల్ యజమాని గంగాధర్‌కు చెందిన ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి వీవర్స్‌కాలనీలోని ఫంక్షన్‌హాల్ వద్ద దహనం చేశారు. సంఘటన స్థలంలో రక్తపు మరకలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

శ్మశాన వాటికను ఆక్రమించారని ఫిర్యాదు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : శ్మశానవాటికను ఆక్రమించుకుని నిర్మాణాలు చేసేందుకు చదును చేస్తున్నారని మదపనల్లె పట్టణం గౌతమినగర్‌వాసులు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పురపాలక సంఘం పరిధిలోని గౌతమినగర్ 410/3బీ సర్వే నంబరులో శ్మశానవాటిన ఉందని, ఇందులో తమ పూర్వీకుల కాలం నుంచి అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్మశానవాటికకు హద్దులు చూపించలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతులు అందజేశామన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి కొందరు జేసీబీలతో శ్మశానవాటికను చదును చేసేందుకు యత్నించారని తెలిపారు. శ్మశానవాటికను సర్వే చేయించి హద్దులు చూపించి ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సుధాకర్, మల్లికార్జున, రామాంజులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టల పటిష్టతను పర్యవేక్షించాలి

రామసముద్రం, న్యూస్‌టుడే : చెరువుకట్టల పటిష్టతపై గ్రామసచివాలయ, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో భానుప్రసాద్ సూచించారు. మండలంలోని రామసముద్రం, టేకుపల్లె, చెల్లాచెరువు కట్టల పరిస్థితులను మంగళవారం ఆయన పరిశీలించారు. చెరువులు, కుంటలు, వాగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు తహసీల్దార్ కార్యాలయంలోని కంట్రోల్‌రూమ్‌కు సమాచారమివ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి క్లోరినేషన్, ట్యాంకుల శుభ్రత, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


ఏఈ రామకృష్ణనాయక్‌కు సమస్యలు విన్నవిస్తున్న అమరనాథరెడ్డి, రేష్మ

పీలేరు, న్యూస్‌టుడే : కాలనీల్లో విద్యుత్తు సౌకర్యం కల్పించడంతో పాటు పీలేరు పట్టణం, ఎర్రగుంటపల్లె పంచాయతీల్లో రోడ్లు దెబ్బతిన్నాయని, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు అధికారులకు సూచించారు. మంగళవారం ఎంపీపీ కంభం సతీష్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పీలేరు మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కాలనీల్లో విద్యుత్తు సౌకర్యం కల్పించాలని కోరారు. వెంకట్రమణారెడ్డి మాట్లాడుతూ.. ఎర్రగుంటపల్లెలోని గ్రామాలకు ఉన్న తారు రోడ్లు పూర్తిగా తొలగిపోయి గుంతలమయమయ్యాయని ఆరోపించారు. రేష్మ మాట్లాడుతూ.. పీలేరు పట్టణం ఆర్టీసీ నల్లగుట్టలో అన్ని వీధుల్లో సీసీ రోడ్లు దెబ్బతిని ప్రజలు నడిచేందుకు, వాహనాలు వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గూడరేవుపల్లె పంచాయతీ సర్పంచి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న తాగునీటి పథకాల మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయనికొత్త మోటార్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షామియానా షఫీ, ఎంపీడీవో శివకుమార్, పీఆర్ డీఈ మధుసూదన్, ఐసీడీఎస్ అధికారిణి రాజమ్మ, ఏఈలు రామకృష్ణనాయక్, ఇరగన్న, ఎంఈవో లోకేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచిలు పాల్గొన్నారు.

రహదారిపై వాననీరు తొలగింపు

స్పందనకు వందనం

రామసముద్రం, న్యూస్‌టుడే : రామసముద్రం - చెంబకూరు ప్రధాన రహదారి మట్లవారిపల్లెలోని ఉన్నత పాఠశాల ఎదురుగా రోడ్డుపై వాననీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై 'రోడ్డు ఇలా ప్రయాణం ఎలా? అనే శీర్షికతో మంగళవారం ఈనాడులో మంగళవారం ప్రచురితమైంది. దీనిపై పాఠశాల తల్లిదండ్రుల కమిటీ, గ్రామస్థులు స్పందించారు. పాఠశాల ముందు రోడ్డుపై నిల్వ ఉన్న వాననీటిని తొలగించి రోడ్డును బాగు చేశారు.

డ్రైవరుకు 3 నెలల జైలు శిక్ష

ముదివేడు (కురబలకోట), న్యూస్‌టుడే : ఓ వ్యక్తి మృతికి కారకుడైన వాహన డ్రైవరుకు 3 నెలల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ మదనపల్లె రెండో అదనపు మున్సిఫ్ కోర్టు తీర్పు ఇచ్చినట్లు ముదివేడు పోలీసులు తెలిపారు. తెట్టు పంచాయతీ దొమ్మన్నబావికి చెందిన ఎనమల చలపతి 2017 జూన్ 2న టమాటా క్రేట్లను వాహనంలో తీసుకుని వెళుతుండగా గుంతపల్లె వంకకు చెందిన వెంకటరమణ అనే వ్యక్తి అదే వాహనంలో టమాటా క్రేట్లపై కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో క్రేట్లపై వెంకటరమణకు విద్యుత్తు లైను తగలడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై ముదివేడు ఎనమల చలపతిపై కేసు నమోదు చేశారు. అనంతరం కేసు దర్యాప్తు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నిందితుడికి 6 నెలల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై నిందితుడు ఏడీజే కోర్టుకు అప్పీలు చేయగా, మూడు నెలల శిక్షను తగ్గిస్తూ తీర్పు ఇచ్చారని పోలీసులు తెలిపారు.

అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శం


అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. మంగళవారం అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ కుటుంబంలో జన్మించిన కలాం కష్టపడి చదివి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఉన్నత స్థానాలు అధిరోహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, తెదేపా నాయకులు నాగార్జున బాబు, రామకృష్ణ, ఉపాధ్యాయుడు మహమ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

✦ వెల్‌విషర్స్ రక్తదాతల సంఘం వ్యవస్థాపకుడు గిరీష్ ఆధ్వర్యంలో మహిళా ఎస్ఐ రమాదేవి, సంస్థ సభ్యులు మంగళవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

న్యాయం చేయాలని బాధిత కుటుంబం ఆందోళన

రామసముద్రం, న్యూస్‌టుడే : రామసముద్రం మండలం ఎగువలంబంవారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో రెండు రోజుల కిందట అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన రెడ్డిశేఖర్ కేసును త్వరగా పరిష్కరించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. రెడ్డిశేఖర్‌తో వివాహేతర సంబంధం కలిగిన మహిళే అతడి మృతికి కారణమని వాపోయారు. నిందితులను త్వరగా అరెస్టు చేయాలని డిమాండు చేశారు. శవపంచనామా నివేదిక ఆధారంగా కేసును త్వరగా పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో బాధిత కుటుంబసభ్యులు నిష్క్రమించారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

సీసీ రోడ్లు నిర్మించాలని నిరసన


స్థానికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు: పట్టణంలోని రాంనగర్, ఒంటెల సిద్ధయ్య కాంప్లెక్స్, చింతంనగర్ ప్రాంతాలలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పి. మణి, మండల సీపీఐ కార్యదర్శి రాజశేఖర్ డిమాండు చేశారు. ఆ ప్రాంతాలలో బుధవారం తిరిగి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లోతట్టుగా ఉన్న ఈ ప్రాంతాలలో వర్షం వచ్చిన ప్రతిసారీ బురదనీరు నిలిచిపోతోందన్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని.. మురుగునీటితో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలంటూ నిరసన వ్యక్తం చేశారు.

ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయొద్దంటూ జేసీకి విన్నపం


జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచి నాగార్జున, గ్రామస్థులు

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు గుర్తించిన ప్రాంతాలతో రైతులు వ్యవసాయ పరంగా నష్టపోయే పరిస్థితి నెలకొందని పలు గ్రామాల ప్రజలు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. సంగంవారిపల్లి, మట్లి, తాటిగుంటపల్లి ఓదివీడు పంచాయతీల్లోని గ్రామాలకు అనుసంధానంగా మాండవ్య నది ఉందని.. ఆ ప్రాంతంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయడానికి అధికారులు గుర్తించారన్నారు. ఆ ప్రాంతంలో ఇసుక తరలిస్తే సమీప పొలాల్లోని బోర్లు, బావుల్లో నీరు అడుగంటుతుందని వాపోయారు. రీచ్‌ల ఏర్పాటు ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని జేసీని కోరారు.

రూ.72 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణం


వడ్డిపల్లెలో సీసీ రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పల్లెలకు నూతన వైభవం తెచ్చేందుకు పల్లె పండుగ పేరుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. రాబోయే రోజులలో ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు. రూ. 72 లక్షలతో పున్నాటివారిపల్లె, హరిజనవాడ, జె. వడ్డిపల్లె, జీవీపురం, నూకనపల్లె, గ్రామాల్లో సిమెంట్ రోడ్లు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వికాస్‌రెడ్డి, ఎంపీడీవో మల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, భారతి పాల్గొన్నారు.

పుల్లంపేట: రైల్వేకోడూరు నియోజకవర్గంలో రూ. 82 లక్షలతో 1,750 మీటర్ల సీసీ రోడ్లకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భూమి పూజ చేశారు. పుల్లంపేట మండలం రంగంపల్లె పంచాయతీ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీసీరోడ్లకు భూమి పూజ చేపట్టారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎంపీడీవో పోతుగుంట జయశ్రీ, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి అండగా నిలవాలి


భాజపా సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, న్యూస్‌టుడే: ప్రపంచ దేశాల్లో దేశాన్ని అత్యున్నత స్థానంలో నిలపడానికి ప్రధాని మోదీ చేస్తున్న ప్రయత్నానికి సభ్యత్వ నమోదు ద్వారా సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు కోరారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మోదీ చేస్తున్న అభివృద్ధికి ప్రజలు ఆకర్షితులు అవుతున్నారన్నారు. రాజంపేట నియోజకవర్గంలో 15 వేలకు పైగా సభ్యత్వ నమోదు అయిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిప్రసాద్, సూర్య చంద్ర, రమణ, ప్రభావతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ


ఫిర్యాదుదారులను విచారిస్తున్న డీఎల్‌పీవో మస్తాన్‌వలీ

వీరబల్లి, న్యూస్‌టుడే: పోలీసు బందోబస్తు మధ్య సానిపాయి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై మంగళవారం డీఎల్‌పీవో మస్తాన్‌వలీ విచారణ చేపట్టారు. పంచాయతీ నిధుల దుర్వినియోగం, పనులు చేయకుండానే నిధులు స్వాహా చేశారని కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు విచారణకు డీఎల్‌పీవో హాజరయ్యారు. గొడవలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, ప్రత్యేక బలగాలతో సానిపాయి సచివాలయం వద్ద బందోబస్తు నిర్వహించారు. అనంతరం డీఎల్‌పీవో మస్తాన్‌వలీ ఫిర్యాదుదారు నేతి రమేష్ నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన చెప్పారు. గ్రామాల్లో పనులు చేయకుండా ఒక్క రూపాయి కూడా డ్రా చేయలేదని సర్పంచి నేతి ఆంజనేయులు పేర్కొన్నారు.

పట్టణ సుందరీకరణ పనులకు గ్రహణం

విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రారంభించని వైనం ● పట్టణ సుందరీకరణ పనుల్లో నిర్లక్ష్యం ● కూడళ్లలో సమకూరని పచ్చదనం


వేంపల్లె రోడ్డులో ప్రారంభానికి నోచుకోని విగ్రహం

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో సుందరీకరణ పనులకు గ్రహణం వీడడం లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రూ. 6.50 కోట్ల మేర నిధులు వెచ్చించి పట్టణ సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. టెండర్ దక్కించుకున్న గుత్తేదారులు పనులు మొదలు పెట్టి మధ్యలోనే అర్ధాంతరంగా నిలిపేశారు. బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో తాను పనులు చేయలేదని గుత్తేదారు అప్పట్లో చేతులెత్తేశారు. దాంతో జాతీయ రహదారిపై పచ్చదనం ఏర్పాటు చేసే పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కూడళ్ల విస్తరణ పనులు అటకెక్కడంతో అక్కడ ఏర్పాటు చేసిన విగ్రహాలు ప్రారంభానికి నోచక తుప్పుపడుతున్నాయి.

● సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ముందు పురపాలక నిధులతో అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రధాన కూడళ్ల సుందరీకరణ, వివిధ విగ్రహాల ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ వచ్చే ఒక్క రోజు ముందు పట్టణంలోని చిత్తూరు రోడ్డు కూడలిలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహం, కూడలి నిర్మాణ పనులు ఆఘమేఘాల మీద పూర్తి చేసి విగ్రహావిష్కరణ చేశారు. కలెక్టరేట్ సమీపంలోని కడప కూడలిలో అన్నమయ్య విగ్రహాన్ని హడావుడిగా ప్రారంభించారు.

● పట్టణ పరిధిలోని కూడళ్లు, రింగ్‌రోడ్డులోని ఇతర కూడళ్లల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ప్రారంభించలేదు. సర్కిళ్ల ఏర్పాటు పనులు కూడా పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. విగ్రహాలకు కప్పిన పట్టలు తరచూ చిరిగిపోతూ విగ్రహాలు తప్పు పట్టే పరిస్థితి ఏర్పడింది. సర్కిల్ నిర్మాణానికి చుట్టూ గోడ ఏర్పాటు చేసి స్టీల్ కమ్మీలు ఏర్పాటు చేశారు.

● విగ్రహాల చుట్టూ పచ్చిక పెంచే పనులు ఇంత వరకు చేపట్టలేదు. దాంతో కడప-చిత్తూరు జాతీయ రహదారిలోని బంగ్లా కూడలి, గున్నికుంట్ల రోడ్డు, వేంపల్లె రోడ్డు కూడళ్లల్లోని విగ్రహాలు ప్రారంభానికి నోచుకోలేదు. దాంతో పురపాలక నిధులు వెచ్చించినా ప్రజా ఉపయోగంలోకి రాకపోవడంతో విగ్రహాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పురపాలక అధికారులు చొరవ తీసుకుని సుందరీకరణ పనులతో పాటు విగ్రహాలను ఆవిష్కరించి పట్టణం సుందరంగా తీర్చిదిద్దాలని పురవాసులు కోరుతున్నారు. త్వరలోనే విగ్రహావిష్కరణ కార్యక్రమాలు చేపడతామని.. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ వాసుబాబు పేర్కొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కందిలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారి రమేష్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని బి.యర్రగుడి, కోనంపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కంది పంటలో ఏర్పడే తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యాన శాఖ అధికారి నాగమణి మాట్లాడుతూ.. నవంబరు నెల నుంచి మామిడిలో పోషకాలు చేపట్టి కొమ్మల కత్తిరింపులు, ఎరువుల వాడకాలు వ్యవసాయ విస్తరణ అధికారులు అనూష, కెరోలిన్, గ్రామ వ్యవసాయ సహాయకులు హరిత, ఓంసాయి, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఓటరు జాబితా పరిశీలన


సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

పెనగలూరు, న్యూస్‌టుడే: సాగునీటి శాఖలో ఎన్నికల ఓటరు జాబితా పరిశీలించి సిద్ధం చేయాలని సాగునీటి శాఖ జేఈ పెనగలూరు మండల ఎన్నికల అధికారి దయానంద పెనగలూరు తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణీని మంగళవారం కోరారు. మండల పరిధిలోని 15 చోట్ల సాగునీటి ఎన్నికలు జరపాల్సిన అవసరం ఉందని చెప్పారు. గత ఎన్నికల ఓటరు జాబితాను పరిశీలించి వాటిల్లో చనిపోయిన వారివి ఉంటే తొలగించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

వాయుగుండం... ప్రజల్లో భయం

● భారీ వర్షసూచనతో ఆందోళన


స్థానికులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నైదియాదేవి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరులో రెండు రోజులుగా మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో ప్రజలకు భయాందోళనకు గురువుతున్నారు. కడప-చెన్నై జాతీయ రహదారిపై ఉన్న ప్రధాన మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఓ వైపు అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. ప్రధాన రహదారికి ఒక వైపు మొత్తం కాలువల్లోని నీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో ఏదుకాణంలోకి, ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. టోల్‌గేట్ నుంచి-బైపాస్ రోడ్డు వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటరు మేర ఇదే పరిస్థితి ఉంది. వర్షం పడిన ప్రతిసారీ ప్రజలు, వ్యాపారులు ఇలా ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ప్రధాన మురుగు కాలువలను ఆధునికీకరించడం, వాటి సామర్థ్యాన్ని పెంచడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. నిధులు లేవంటూ పంచాయతీ అధికారులు చేతులెత్తేస్తుండగా.. ప్రజల కష్టాలను రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడి ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని నేతలు చెప్పినా క్షేత్రస్థాయిలో ఒక్క పనీ జరగలేదు. కనీసం ఇప్పటి నాయకులైనా సమస్యను ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైల్వేకోడూరులో మురుగు నీటి సమస్యలకు పరిష్కారం చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వీరబల్లి: మండలంలో తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో సాగు చేసిన ప్రత్యామ్నాయ పంటలకు ఊరటగా ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంత రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. గుంతల్లో వర్షపు నీరు నిల్వ అయి అటు వైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రాయచోటి-రాజంపేట మార్గంలోని ఓదివీడు కుమ్మరపల్లి వద్ద రోడ్డుపై ఉన్న గుంతలలో నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

రాజంపేట: రానున్న రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ప్రభుత్వ పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు సబ్ కలెక్టర్ నైదియాదేవి తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ.. రాజంపేట డివిజన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలను గుర్తించామని, అక్కడ రహదారులు, కల్వర్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎలాంటి సమస్యల్లేకుండా చేసే విధంగా అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. దెబ్బతిన్న పాఠశాలల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వర్షం ప్రభావిత ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ పర్యటించారు. సుద్దగుంతల ప్రాంతంలో వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నా ప్రజలతో ఆమె మాట్లాడారు. పట్టణంలోని రైల్వేకోడూరు మార్గంలో పొంగిపొర్లుతున్న మురుగు నీటిని పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని పురపాలక కమిషనర్ నాగేశ్వరరావును ఆమె ఆదేశించారు.


రైల్వేకోడూరులో చెత్తను శుభ్రం చేయకుండా పంచాయతీ కార్మికులు వదిలేశారిలా..

నందలూరులో 47.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

రాయచోటి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలోని అన్ని మండలాలలో మంగళవారం భారీ వర్షం కురిసింది.. జిల్లా వ్యాప్తంగా రాత్రి 10 గంటల వరకు సరాసరి 18.63 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నందలూరులో అత్యధికంగా 47.4 మిల్లీ మీటర్లు నమోదు కాగా చిట్వేలిలో 40.8, పెనగలూరులో 40.0, పుల్లంపేటలో 39.8, రాజంపేటలో 29.4, రైల్వేకోడూరులో 34.2 మి.మీ నమోదైంది. గాలివీడులో 16.4, సుండుపల్లిలో 16.6, లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెంలలో 13.0 మి.మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.


వీరబల్లి : ఓదివీడు కుమ్మరపల్లి వద్ద రహదారిపై నిలిచిన వాన నీరు

వాయుసుతుడికి ప్రత్యేక పూజలు

పుల్లంపేట, న్యూస్‌టుడే: అనంతంపల్లె పొలాల్లో వెలసిన మట్లిరాజుల కాలం నాటి కోటగడ్డ ఆంజనేయస్వామి మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. తొలుత స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పోలీసులకు సమ దుస్తుల వితరణ


పోలీసులకు దుస్తులు అందిస్తున్న బిట్ కళాశాల ఛైర్మన్ భాస్కర్, ఎస్సై వెంకట సుధాకర్‌రెడ్డి

రామాపురం, న్యూస్‌టుడే: రామాపురం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుళ్లకు బిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ మన్నూరు భాస్కర్ మంగళవారం సమ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజా శ్రేయస్సు, ప్రజల భద్రత కోసం శ్రమిస్తున్న పోలీసులకు తన వంతుగా 25 మందికి సమ దుస్తులు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై జాగ్రత్తలు అవసరం

సిద్దవటం, న్యూస్‌టుడే : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఉద్యాన పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలని బద్వేలు ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లె, బొగ్గిడివారిపల్లె గ్రామాల్లో పసుపు, అరటి, మామిడి పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. పొలాల్లో నిల్వ ఉండే నీటిని గట్లు తెంపి బయటకు పంపాలన్నారు.

కల్వర్టు శిథిలం.. రాకపోకలకు ఆటంకం


కుషావతి నదిపై దెబ్బతిన్న కల్వర్టు

గాలివీడు-మదపనల్లె మార్గంలో బస్సు సర్వీసులు అధికంగా నడుస్తున్నాయి. వర్షాకాలంలో అరవీడు సమీపంలోని కుషావతి జలాశయంలోకి నీరు సమృద్ధిగా చేరుతోంది. దిగువన నదిలో ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. ఎల్లంపల్లె వద్ద నదిపై ఉన్న పైపు కల్వర్టు మూడేళ్ల కిందట భారీ వర్షాలకు దెబ్బతింది. కొన్నాళ్లకు తాత్కాలిక పనులతో రవాణా పునరుద్ధరించారు. వర్షాలు కురిసినప్పుడల్లా ఈ మార్గంలో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. నదిపై వంతెన నిర్మించాలని ప్రయాణికులు, చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

పురాతన కోవెలలో గుప్తనిధులకు తవ్వకాలు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలో పురాతన కాలం నాటి రంగనాయకస్వామి కోవెలలో గుప్తనిధి కోసం నిర్మాణాన్ని పగలగొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇక్కడి మూలవిరాట్‌ను గతంలో దుండగులు ధ్వంసం చేయడంతో కొన్నేళ్లగా ఆలయం మూతపడి ఉంది. ఇటీవల గుర్తుతెలియని గుప్తనిధి కోసం కోవెలలోకి వెళ్లి ప్రధాన గుడికి ఎదురుగా గరుత్మంతుని గుడిపై ఉన్న రాతి మొగ్గను పగులగొట్టారు. ఆలయంలో మంగళవారం నిర్వహించిన తలనీలాల వేలం కార్యక్రమానికి వచ్చిన వారు వరిగిన ఉన్న రాతి మొగ్గను చూడడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గతంలో ఈ కోవెలలో గుప్తనిధి కోసం పలుమార్లు తవ్వకాలు, చోరీలు జరిగాయి. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని ఎస్సై చిరంజీవి తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

సంబేపల్లె(రాయచోటి): సంబేపల్లెలోని పలు వీధులలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మంగళవారం రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భూమి పూజ చేశారు. మండలంలోని అంబేడ్కర్‌కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 80 తాగునీటి బోర్లు వేయించి నీటి సమస్యను పరిష్కరించామన్నారు. ఆయన వెంట తెదేపా నాయకులు ఎం. నరసారెడ్డి, నాగేశ్వర్‌నాయుడు, కూనాసి సుబ్బరాజుయాదవ్, స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

సిద్దవటం, న్యూస్‌టుడే : పశు సంవర్ధకశాఖలో పనిచేసే అధికార సిబ్బంది తప్పకుండా సమయ పాలన పాటించాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టరు రమణయ్య తెలిపారు. సిద్దవటంలోని పశు సంవర్ధకశాఖ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ నెల 16వ తేదీ నుంచి జరగనున్న నట్టల నివారణ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అసిస్టెంటు డైరెక్టరు లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతలకే మద్యం దుకాణాలు: ఎంపీ

రాయచోటి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల మాట మరిచిందని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆరోపించారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. మద్యం, ఇసుక విధానాలలో సంపాదనపై దృష్టి సారించిందే తప్ప వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. మద్యం దుకాణాలను అధికార పార్టీ నేతలే దక్కించుకుని సిండికేట్‌గా మారారని ఆరోపించారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం


రాజంపేటలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న సాయిలోకేశ్, నాయకులు


పుల్లంపేట ఎమ్మార్సీలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి నమస్కరిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది


సుండుపల్లిలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం అందరికీ ఆదర్శప్రాయులని వక్తలు పేర్కొన్నారు. ఆయన జయంతిని మంగళవారం రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. రాజంపేటలో భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ స్థానిక నేతలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. దేశానికి చేసిన సేవలను కొనియాడారు. యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. లక్కిరెడ్డిపల్లెలో డాక్టర్ షఫీనాయక్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సుండుపల్లిలో స్థానికులు ఆయన చిత్ర పటం వద్ద నినాదాలు చేశారు. **- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం**

మసీదులో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

ఓబిలి(పెనగలూరు): మండల పరిధిలోని ఓబిలి మసీదులో హజరత్ పీరానె పీర్ గ్యారమీ షరీఫ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆలీ బాషా, కార్యదర్శి సర్వర్ ఆలీని సభ్యులు మాజీ సర్పంచి హబీబుల్లా, గౌస్ బాషా, సయ్యద్ అన్వరుద్దీన్, బషీర్, ఆరీఫ్, షేక్ రషీద్, తహీర్ బాషా, షమీవులాలు సన్మానించారు.

గొంతువాపుతో గేదెల మృత్యువాత

ఒంటిమిట్ట: వాతావరణంలో వచ్చిన మార్పులతో పశువుల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. మండలంలోని చిన్నకొత్తపల్లిలో కొన్ని రోజులుగా పాడి గేదెలు, దూడలు గొంతు కింద వాపు లక్షణాలతో బాధపడుతున్నాయి. ఇప్పటికే మూడు పశువులు మృతి చెందటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెదేపా మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె.బొబ్బిలిరాయుడు తెలిపారు. గొంతువాపు జబ్బు నివారణ కోసం పశువులకు టీకాలు వేయిస్తామని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి సి. శారదమ్మ తెలిపారు.

ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీలు

సిద్దవటం: వంతాటిపల్లె, మాచుపల్లె, ఉప్పరపల్లె, బొగ్గిడివారిపల్లె, పెద్దపల్లె, తదితర గ్రామాల్లో మంగళవారం ఈ-పంట నమోదుపై వ్యవసాయ అధికారులు సామాజిక తనిఖీలు నిర్వహించారు.

ఇనుప కంచె ధ్వంసం

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మండలంలో పరిధిలోని చెన్నరాజుపోడు గ్రామానికి చెందిన రైతులు సురేష్, వెంకటరమణ, చెంగల్‌రాయుడుల పొలాల చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కంచెను కొందరు వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన బాధితులు గుర్తించి ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

రెండు దుకాణాలలో చోరీ


చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలోని వేర్వేరు దుకాణాలలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. రాజులకాలనీలో ఉన్న ఆంజనేయ ఎంటర్ ప్రైజెస్ దుకాణం షెట్టర్ తొలగించి అందులో ఉన్న నగదు, సిగరెట్ బండిళ్లను తీసుకెళ్లారని యజమానులు వాపోయారు. దుకాణంలోని సీసీ కెమెరా హార్డ్‌డిస్కులను సైతం తీసుకెళ్లారన్నారు. అదేవిధంగా సుండుపల్లి రోడ్డులోని స్టార్ కూల్‌డ్రింక్ దుకాణంలో రూ. 20 వేలు నగదుతో పాటు రూ. 50 వేల విలువైన సిగరెట్ బండిళ్లను దోచుకెళ్లారని బాధితులు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ చంద్రశేఖర్ చోరీ జరిగిన దుకాణాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అస్తవ్యస్తంగా పూడిక పనులు... అవస్థల్లో ప్రజలు

● ఇదీ రాజంపేట పురపాలకలో దుస్థితి ● పట్టించుకోని అధికారులు


ఆర్ఎస్ రోడ్డు వద్ద రోడ్డుపై డ్రైనేజీ వ్యర్థాల నిల్వలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట పురపాలక పరిధిలో ఉన్న మూడు రకాల డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన డ్రైనేజీ వ్యర్థాలను తొలగించడానికి ప్రభుత్వం రూ. 32 లక్షలు కేటాయించింది. ప్రధాన కాలువ పనులు చేయడానికి అధికారులు గుత్తేదారుల ద్వారా పనులు కేటాయించారు. నెల రోజులగా పనులు ముందుకు జరగకపోవడంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డు వద్ద 15 రోజులు కిందట పనులు ప్రారంభించారు. వేగంగా పూర్తి చేయాల్సి ఉన్నా కాలయాపన చేయడంతో స్థానిక ప్రజలతో పాటు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.

● పాత బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రధాన డ్రైనేజీ కాలువ నాలుగు కిలోమీటర్లు ఉంది. గత ప్రభుత్వం ఒకసారి కూడా కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలిగించడానికి రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో డ్రైనేజీ కాలువలు, పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా వాననీరంతా నివాసాల వద్ద నిలుస్తోంది. దీంతో పది రోజుల నుంచి స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలు పరిష్కరించడానికి తెదేపా కూటమి ప్రభుత్వం రూ. 32 లక్షలు కేటాయించినా పనులు పూర్తి కావడం లేదు.

● ఈ విషయంపై రాజంపేట పురపాలక కమిషనర్ నాగేశ్వరరావును వివరణ కోరగా ఇప్పటికే గుత్తేదారుడితో మాట్లాడామన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోతే నోటీసులు జారీ చేస్తామని చెప్పామన్నారు. పనులు నాణ్యతగా చేయకపోయినా.. పైకప్పు రాళ్లు ఏర్పాటు చేయకపోయినా చర్యలు తీసుకుంటామని చెప్పారు.